ఆపరేషన్ అభ్యాస్

యుద్ధం వస్తే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్



అంబర్‌పేట: యుద్ధంతో అత్యవసర పరిస్థితులు తలెత్తితే పౌరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. వివిధ అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైల్వే ప్రయాణికులకు ప్రత్యేక్షంగా చూపించారు. ఎయిర్ సైరన్ మోగితే తీసుకునే జాగ్రత్తలు, మెడికల్ ఎమర్జెన్సీ, బాంబులు పడితే తప్పించుకునే విధానం, పేలని బాంబుల పట్ల వ్యవహరించే తీరు, గాయపడ్డ వారికి ప్రాథమిక చికిత్స వంటి అంశాలపై మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పించారు. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ ఉదయ్‌నాథ్ కోట్ల ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి మాక్‌డ్రిల్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు రాజ్ దుర్గై, కేఎస్ స్వామి, కె.బాలాజీ పాల్గొన్నారు.

పద్మశాలికాలనీలో మాక్‌డ్రిల్‌పై అవగాహన

భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బుధవారం నగరంలో నిర్వహిచిన మాక్‌డ్రిల్‌పై అవగాహన కల్పిస్తూ భోలక్‌పూర్ పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటి తలుపులు మూసి, విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో కాలనీ అంతా నిర్మానుష్యంగా మారింది. సుమారు 45 నిమిషాల పాటు కాలనీవాసులంతా తమ ఇళ్లలోనే ఉన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కాలనీలోని సుమారు 400 కుటుంబాలకు యుద్ధం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. 1971వ సంవత్సరంలో మొదటిసారిగా దేశంలో మాక్‌డ్రిల్ జరిగిందని ఆ తర్వాత ఇదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుందర్ పతాలే, నాయకులు శ్రీనివాస్, కమల్‌కుమార్ శర్మ, సుజాత, ఉమా తదితరులు పాల్గొన్నారు.







కాచిగూడ రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించిన వివిధ విభాగాల రైల్వే అధికారులు సిబ్బంది

నాలా పూడికతీత పనుల పరిశీలన

అంబర్‌పేట: డివిజన్‌లో వర్షపు నీటి సమస్య తలెత్తకుండా నాలా పూడికతీత పనులు వేసవి ముగిసేలోగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని మౌలానా ఆజాద్‌నగర్, లాల్‌బంగ్లా తదితర ప్రాంతాల్లో నాలా పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో పూడికతీత పనులను చేపట్టాలని ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, రవియాదవ్ తదితరులున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు

కవాడిగూడ: గంగపుత్ర కాలనీలో నిర్మాణానికి దురుద్దేశంతో అడ్డంకులు సృష్టిస్తున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ అధికారులపై భవన యజమానులు శంకర, సాయి కిషోర్ బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్‌కు వినతి పత్రం అందజేసి టౌన్‌ప్లానింగ్ అధికారులు వేధిస్తున్న తీరును వివరించారు. అధికారులు ఇచ్చిన నోటీసుపై తాము వివరణ ఇవ్వడంతో పాటు కోర్టు నుంచి ఇచ్చిన ఆదేశాల కాపీని సైతం అధికారులకు అందజేశామని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమను వేధించడం మానుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

మహిళలను దూషించిన వ్యక్తికి 15రోజుల జైలు

చిక్కడపల్లి: మహిళను దూషించిన వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... రాంనగర్‌కు చెందిన సి.పాండు(40) మద్యం మత్తులో ఎస్సార్టీ పార్క్ పరిసరాల్లో చిన్నచిన్న ఇనుప వస్తువులను దొంగిలించాడు. ఆ సమయంలో అడ్డగించిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం కాకుండా దూషించారు. ఈ విషయాన్ని సదరు మహిళలు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని ఐదో ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టారు. నిందితుడికి 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

కవాడిగూడ: ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా నగర ఎన్‌ఫోర్స్‌మెంట్ బీటీమ్ సభ్యులు, ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... బీటీమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై శ్రీనివాస్ స్టేషన్ పరిధిలో లాలాగూడ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించిన శివరాం (24), మహేందర్ (25)లను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా 1.2 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేశామని ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

రాజ్యాంగ విలువలపై అవగాహన పెంచడమే లక్ష్యం

చిక్కడపల్లి: వాల్మీకినగర్, అన్నానగర్, సబర్మతి నగర్, అరుంధతినగర్ తదితర ప్రాంతాలలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ బుధవారం 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్'ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం గాంధీజీ చూపిన అహింస, శాంతిమార్గాన్ని విస్మరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్

ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ దాడులపై సర్వత్రా హర్షం

భారత సైన్యానికి మద్దతుగా వివిధ పార్టీల ర్యాలీలు

చిక్కడపల్లి: కశ్మీర్‌లోని పహల్గాంలో మతం అడిగి కాల్చి చంపిన పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్'పేరుతో భారత ఆర్మీ చేపట్టిన దాడులపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. భారత ఆర్మీ 100కు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిందని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని ఆంధ్రకేఫ్ చౌరస్తా వద్ద బుధవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ... ముష్కరులు భారత్ వైపు చూసేందుకు కూడా భయపడే విధంగా పాకిస్తాన్‌పై యుద్ధ చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. భారత సైనిక బలగాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిన మోదీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ జెండాలు పట్టుకుని ''వందేమాతరం.. భారత్ మాతాకీ జై.. జై జవాన్.. జై భారత్''అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీరాజు, ఎం.ఉమేష్, ప్రకాష్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, మదన్మోహన్, సాయికుమార్, దోనేటి సత్యం, సత్యేంధర్, డి.కుమార్, ధనరాజ్, జ్ఞానేశ్వర్, రఘుయాదవ్, సాయి కృష్ణయాదవ్, నీరజ్, ప్రశాంత్, రాహుల్, భాను, కృష్ణవేణి, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రకేఫ్ వద్ద బాణసంచా పేలుస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్, నాయకులు

ప్రతి భారత పౌరుడు గర్విస్తున్నాడు: ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: పహల్గాంలో భారతీయులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా భారత జవాన్‌లు దీటైన జవాబు చెప్పారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు మెరుపు దాడులు జరపడం హర్షణీయమని అన్నారు. భారత సైనికులకు మద్దతు తెలుపుతూ బుధవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ జాతీయ జెండాలను చేతబట్టి ముషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై... జై జవాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి తన సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను నేటమట్టం చేయడంతో పాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన విధానం చూసి ప్రతి పౌరుడు గర్విస్తున్నాడని అన్నారు. మతం పేరుతో ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్‌హౌస్ శ్రీనివాస్, ఎండీ మోహన్, జావిద్ ఖాన్, పరుశురాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ డివిజన్‌లో జాతీయ జెండాలు పట్టుకొని సైనికులకు మద్దతుగా నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు



ముషీరాబాద్‌లో త్రివర్ణ పతాకాలను చేతపట్టి భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, జైసింహ, బీఆర్‌ఎస్ నేతలు

రైల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

- రూ.1.57లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం

అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా రైల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం కాచిగూడ రైల్వే పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావేద్, ఇన్‌స్పెక్టర్ ఎల్లప్పలు వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన గుల్ఫామ్ గ్రామానికి చెందిన దుర్యోధన్ చంప్తి కుమారుడు భగవాన్ చంప్తి(23), సుమంత మహంతి(24) స్నేహితులు. కాగా వీరు కొన్ని నెలలుగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించి షాద్‌నగర్‌లో ఉండే స్నేహితుడికి అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం విశాఖపట్నం - కాచిగూడ రైల్లో వచ్చి కాచిగూడ స్టేషన్‌లో దిగి అనుమానాస్పదంగా కనిపించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప సిబ్బందితో కలిసి వారి వద్ద తనిఖీ చేయగా రూ.1.57లక్షల విలువ చేసే 3కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. అసలు సూత్రదారి భవన్ సుబుది అని తేలిందన్నారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్

కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్లిన ఇద్దరి అరెస్టు

చిక్కడపల్లి: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని దురాశతో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం సాంయత్రం చిక్కడపల్లి పోలసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు రాజునాయక్, రాంబాబు, డీఐ శంకర్ మాలోత్‌తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వినోద్ బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరంలో లేబర్ పని చేసుకుంటూ చిక్కడపల్లి మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌పై ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.

- ఈనెల 5న చిక్కడపల్లి మెట్రో పిల్లర్ నం.1120 వద్ద వినోద్ నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో పాత నేరస్తులు కానుకుంట్ల మల్లేష్ (27), మాలోతు నరేష్(31) అతడి వద్దకు వెళ్లి కత్తితో బెదిరించి నగదు లాక్కెళ్లారు. బాధితుడు వెంటనే చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. డీఐ శంకర్ మాలోత్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక పేపర్ కటింగ్ బ్లేడ్‌తో పాటు కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. త్వరితగతిన కేసును చేధించడంతో చిక్కడపల్లి పోలీసులను సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పావల్లి, అదనపు డీసీపీ ఆనంద్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు రాజునాయక్, రాంబాబు, డీఐ శంకర్

సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి డివిజన్‌లోని వాల్మీనగర్ సమీపంలో చెట్టు నేలకూలంది. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడి అంధకారం నెలకొంది. వెంటనే డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించారు. చెట్ల కొమ్మలను తొలగించారు. చెట్ల కొమ్మలు జంక్షన్‌పై పడటంతో విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం సరఫరాను నిలిపివేసి విద్యుత్ తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీజేపీ సీనియర్ నేత వినయ్‌కుమార్‌లు వేర్వేరుగా సందర్శించి పనులను పర్యవేక్షించారు. ఏ సమస్య ఉన్నా కార్పొరేటర్ పావని పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరా పార్క్ ఏడీఈ సంపత్‌కుమార్, గాంధీనగర్ ఇన్‌చార్జీ ఏఈ సంతోష్ ఆనంద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలు పునరుద్ధరించాలి

చిక్కడపల్లి: తూనికలు కొలతలు శాఖలో మీ సేవా ద్వారా కొనసాగిన ఆన్‌లైన్ సేవలను వెంటనే పునరుద్ధరించాలని తాందార్ అధ్యక్షుడు రబ్బాని, ఉపాధ్యక్షుడు గిరిధర్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్‌లోని తూనికలు కొలతలు రాష్ట్ర కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 8 నెలలుగా మీ సేవా కేంద్రాలల్లో నూతన లైసెన్స్, రెన్యువల్ ఇతర సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రధానంగా టెండర్లలో పాల్గొనలేకపోతున్నామని తెలిపారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, తూనికలు కొలతలు శాఖ కంట్రోలర్ డీఎస్ చౌహాన్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సాధ్యమైనంత తొందరగా ఆన్‌లైన్ విధానాన్ని సరిచేయాలని కోరారు.

నృత్యప్రేరణ పురస్కారాల ప్రదానోత్సవం



పురస్కారాలు అందుకుంటున్న చిన్నారులు

సాక్షి, సిటీబ్యూరో: ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలకు కేవలం చదువే కాకుండా మన కళలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని ఓయూ మాజీ డైరెక్టర్ ఎంకే రాము అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగిన శ్రీశాంభవి కూచిపూడి ఆర్ట్ అకాడమీ నృత్య ప్రేరణ పురస్కారాలు-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కూచిపూడి నాట్యం నేర్చుకోవడం వల్ల ఓపికతో పాటు పిల్లలకి జీవన విధానంలో మార్పులు వస్తాయని అన్నారు. అవి పిల్లలకి చాలా ఉపయోగపడతాయని చెప్పారు. కూచిపూడి నాట్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన రొహాలిక, బట్లంకి సాయి, శాన్విశ్రీ పవార్, తన్వీలతో పాటు పలువురు చిన్నారులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాకునూరి సూర్యనారాయణ మూర్తి, నటుడు, క్లాసికల్ డ్యాన్సర్ కౌశిక్ బాబు, గూడెపు నర్సింగరావు, లలిత, ధనలక్ష్మి, శృతి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో సామాజిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులకు రక్షణ కరువైందని ఆరోపించారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ విధానాలపై కార్మికవర్గంతో కలిసి నడవాలన్నారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, నాయకులు ఎండీ అబ్బాస్, వెంకటేష్, రమేష్, ఆర్. వెంకట్‌రాములు, కొలా జనార్ధన్, అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంధును జయప్రదం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంధును జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ పిలుపునిచ్చారు. విద్యానగర్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సాగర్ మాట్లాడుతూ.. మే 8 నుంచి 15 వరకు జీపు జాతర్లు, సైకిల్ మోటర్ ర్యాలీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, 16 నుంచి 19 వరకు గ్రామాలలో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో కార్మికులు కర్షకులు, మేధావులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మామిడాల భిక్షపతి, జక్కుల వెంకటయ్య, నాగిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి,ప్రసాదన్నా , శోభన్ నాయక్, డేవిడ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోచార్జీల పెంపు ఆలోచనను విరమించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ మెట్రో చార్జీల పెంపు ఆలోచనను విరమించుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి హన్మేష్ కోరారు. బుధవారం రాంనగర్‌లోని మార్క్స్‌భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హన్మేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 3 లైన్లుగా నడుస్తున్న మెట్రోరైల్‌లో రోజుకు రూ.5 లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారన్నారు. మెట్రో నష్టాలతో నడుస్తున్నదనే నేపంతో ప్రయాణికులపై చార్జీల భారం మోపాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. ఒక వేళ అలాంటి ప్రయత్నమే జరిగితే వెంటనే విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వాలు రవాణా వ్యవస్థను సులభతరం చేయాల్సింది పోయి ప్రజలపై ఆర్థికభారాన్ని మోపడం సరికాదన్నారు. వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, ఝాన్సీ, తేజ, విజయ్, ఎస్ఎల్.పద్మ, కేఎస్.ప్రదీప్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హన్మేష్

వైభవంగా కన్యకాపరమేశ్వరి జన్మోత్సవం

ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు



నల్లకుంట: ఆర్యవైశ్య సంఘం నల్లకుంట ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో బుధవారం కన్యకాపరమేశ్వరి జన్మోత్సాన్ని వైభవంగా నిర్వహించారు. బాబా మందిరం మొదటి అంతస్తులో ఉదయం 9గంటలకు ప్రారంభమైన వేడుకల్లో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ లంక శశి రామ సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. హారతి, నైవేద్యం నివేదన తర్వాత భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి అంజన్‌కుమార్‌గుప్తా, కోశాధికారి ఉప్పల శివకుమార్‌గుప్తా, ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి లింగప్రకాష్‌గుప్తా, ప్రాజెక్టు చైర్మన్లు జయరాములు, సముద్రాల చంద్ర సందీప్, కృష్ణమూర్తి, చంద్రమౌళి, జైన శ్రీనివాస్, రమేష్ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

కవాడిగూడ: వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మోత్సవాన్ని బుధవారం గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కవాడిగూడలోని శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపకులు మల్లంపేట రమేష్‌రాం సంఘం అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా గౌరయ్య, పబ్బ విశ్వనాథం, నాగరాజు, శ్రీనివాస్, కేశవరాజు, అశోక్, ఉమాదేవి, జయప్రద, స్వప్న, సంధ్య, శ్రీదేవి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీరమణ చౌరస్తాలో మజ్జిగ పంపిణీ

అంబర్‌పేట: వాసవీ మాత జన్మోత్సవాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట ఆర్యవైశ్యం సంఘం ప్రతినిధులు బుధవారం శ్రీరమణ చౌరస్తాలో మజ్జిగ పంపిణీ చేశారు. వాహనదారులు, పాదచారులకు వేసవి దాహార్తిని తీర్చి సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ రాంచందర్‌గుప్తా, అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి వాసుగుప్తా, ప్రతినిధులు వెంకటేష్, సత్యనారాయణ, రమేష్, వెంకట రమణ, నాగభూషణం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

